క్లుప్తంగా

ప్రజల వినతులకు పరిష్కారం



మహిళల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి

రాజంపేట : ప్రజల వినతులు సత్వరమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి అన్నారు. సోమవారం అన్నమయ్య సభాభవన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతులను నిబంధనల మేరకే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి వినతికి జవాబుదారితనం ఉండేలా రిజిష్టరులో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ సిబ్బందితోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జరిమానా

రాయచోటి (జగదాంబసెంటర్) : నాసిరకం ఆహార పదార్థాలను ప్రజలకు అమ్మడం, అలాగే ఆహార పదార్థాలను వేయించడానికి వంటనూనెను మూడు సార్లకు మించి మళ్లీ ఉపయోగించిన నేరానికి రాయచోటి పట్టణంలోని ఎనిమిది దుకాణాలకు జరిమానా విధించినట్లు జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్ కె.షమీమ్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆదేశాల మేరకు జరిమానా విధించామన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ బత్యాలచెంగల్‌రాయులు హాజరయ్యారు. విద్యార్థులు చదువులో చురుగ్గా రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకొన్నాయి. విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్విజ్, వక్తృత్వ పోటీలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు సోమవారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో భాగంగా ఈ పోటీలు నిర్వహించామని ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నందలూరు : ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన షాట్‌పుట్ పోటీల్లో మండలంలోని నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్ ఉస్మాన్ అలీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, వ్యాయామ ఉపాధ్యాయిని గౌరీ, ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, గంగనపల్లి వెంకటరమణ, సుబ్బరాయుడు, విజయ కుమారి, తులసీ, స్వర్ణలత, రమణమ్మ, జ్యోతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి..

సంబేపల్లె : జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో సంబేపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల, నియోజకవర్గ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఖోఖో అండర్ 14లో పవన్ కుమార్, అండర్ 17లో చైతన్య, కబడ్డీలో నాగ చైతన్యరెడ్డి, అథ్లెటిక్స్ అండర్ 17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో నిరంజన్, 1500 మీటర్లలో రెడ్డిరహిమాన్, 3000 మీటర్లలో రాజు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్రరాజు, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు విజయభాస్కర్, దేవప్రసాద్‌రెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ విద్యార్థుల ప్రతిభ

రైల్వేకోడూరు అర్బన్ : ఈ నెల 10వ తేదీ నుంచి 26 వరకు మైదుకూరు, పులివెందుల, పుల్లంపేటలో జరిగిన అండర్ 19 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బేస్‌బాల్, క్రికెట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఆడటానికి వైఎస్సార్ జిల్లా జట్లకు ఎంపిక అయినట్లు ఎస్వీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. జిల్లా జట్టుకు తమ కాలేజీ నుంచి విద్యార్థులు ఎంపిక అవడంపై సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వసుంధర, పీఈటీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు టాలెంట్ టెస్ట్

రాయచోటి అర్బన్ : మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మంగళవారం రాయచోటి డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారన్నారు.

రాయచోటి అభివృద్ధికి సమైక్యంగా పని చేద్దాం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

- మున్సిపల్ సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణాభివృద్ధికి పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరం కలసి పని చేద్దామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ సభా భవనంలో చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో అందరినీ కలుపుకొని పోతూ రాయచోటి అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. సమావేశంలో మొదటగా అజెండాలోని అంశాలపై చర్చ జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్ మాట్లాడుతూ మార్కెట్, బస్టాండు గేటుల వసూలు టెండర్‌ను తక్కువకే వేలంపాట పాడారన్నారు. వేలం పాటదారులు రైతులు, వ్యాపారుల నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా అధికమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారిపై రౌడీరాజ్యంలో దాడులు చేస్తున్నారంటూ ఆరోపించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ 'రౌడీరాజ్యం' అనే పదం మరోమారు వాడకూడదంటూ అభ్యంతరం తెలిపారు. సభ్యులందరూ గౌరవప్రదంగా మాట్లాడాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీలలో లాగే రాయచోటిలో గేటు వసూలు చేస్తున్నారన్నారు. కౌన్సిలర్ హారూన్ మాట్లాడుతూ గేటు టెండర్ తక్కువకు పాడుకుని వసూలు ఎక్కువగా చేస్తూ వ్యాపారులు, రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, వారిని నియంత్రించాలంటూ మంత్రికి విన్నవించారు. పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలోని 7వార్డుల ప్రజలు తాగునీటి సమస్యతో తల్లడిల్లుతున్నారని, వెంటనే పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మింపచేయాలంటూ కోరారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సభ్యులందరూ సహకరిస్తామంటూ తెలిపారు. కౌన్సిలర్లు మదనమోహన్‌రెడ్డి, గౌస్‌ఖాన్, మాధవీలత, విజయమ్మ, అల్తాఫ్, కొలిమి చాన్‌బాషాలు మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల మనుగడ కోసమే పన్నులు వసూలు చేయడం జరుగుతోందన్నారు. గేటు వసూలు టెండర్ తక్కువకు పాడి వుంటే అధికారులు దానిని రద్దు చేయాలంటూ కోరారు. రాయచోటి నుంచి జిల్లా కేంద్రం తరలిపో తోందంటూ జరుగుతున్నదంతా దుష్ప్రచారమే అన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ జిల్లా కేంద్రం తరలిపోకుండా చూసే బాధ్యత తనదన్నారు. అవసరమనుకుంటే ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తుందే తప్ప ప్రస్తుతమున్న జిల్లాలను మార్చే ప్రసక్తే ఉండదన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వాసుబాబు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు, కూలీలను ఆదుకోవాలి

- ప్రతి ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వాలి
- నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి
- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాభావం కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందుల పట్ల స్పందించారు. రాయచోటి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అందివ్వలేదన్నారు. ప్రతి రైతుకు ఒకే విడతలో రూ.20 వేల వంతున రైతు భరోసా కింద వెంటనే చెల్లించాలని కోరారు. ఖరీఫ్ సీజన్ కూడా ముగింపు దశకు వచ్చిందన్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోయాయన్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలానే కొనసాగితే రానున్న వేసవిలో మరింత ఇబ్బందులను ఎదుర్కోవడంతో పాటు తాగునీటి సమస్యలు తీవ్రంగా తలెత్తుతాయన్నారు. జూలైలో వేలాది ఎకరాలలో సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలు పూత వచ్చే కీలకదశలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో నిలువునా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారని తెలిపారు. వ్యవసాయ బోర్లలో నీటిమట్టం అడుగంటిపోవడంతో సాగు చేసిన టమోటా ఇతర కూరగాయల పంటలు ఎండిపోయి పొలాలపైనే కూరగాయల పంటలను వదిలివేశారన్నారు. నీటికొరత కారణంగా మామిడి, ఇతర పండ్ల తోటలు ఎండిపోతున్నాయన్నారు. వర్షాలు లేనందువల్ల రైతులు పంట వేసినా, వేయకున్నా ఈ క్రాఫ్ బుకింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించాలని, ఉచితంగా బోర్లు వేయాలని, పండ్ల తోటల రైతులకు ఎకరాకు రూ.20 వేలు చొప్పున పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేయాలన్నారు. పంట ఈ క్రాప్ బుకింగ్ నమోదులో వివక్ష చూపినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కరువు పరిస్థితుల వల్ల పంటలు సాగు చేయలేని పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఎకరాకు పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. అరకొర ఉన్న నీటి వసతులతో పంటలు సాగు చేసుకున్నా పంటలు రాక ఎండిపోతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో లాగా ఈ ప్రభుత్వంలో ఎటువంటి సంక్షేమ పథకాలను అందివ్వకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను, కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు.

ఆకాశాన్ని అంటుతున్న ధరలు : నిత్యావసర సరుకుల ధరలు మార్కెట్లో ఆకాశాన్ని అంటుతున్నాయని శ్రీకాంత్‌రెడ్డి ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలను వీలైనంత వరకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

సాక్షం అంగన్‌వాడీతో నాణ్యమైన విద్య



రాజంపేట రూరల్ : బలిజపల్లిలో సాక్షం అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభిస్తున్న సీడీపీఓ సుజామని

రాజంపేట రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలను సాక్షం అంగనవాడీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యతోపాటు పోషణను చిన్నారులకు అందించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వై.సుజామని తెలియజేశారు. మండల పరిధిలోని బలిజపల్లి, మునక్కాయలపల్లి, మందరం రాచపల్లి, నారంరాజుపల్లి అంగనవాడీ కేంద్రాలను సాక్షం అంగనవాడీ కేంద్రాలుగా మార్చి ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగనవాడీ కేంద్రాలను దశల వారీగా సాక్షం అంగనవాడీ కేంద్రాలుగా మార్పు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ హనుమంతు రమేష్, జూనియర్ అసిస్టెంట్ కవిత, సూపర్ వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దవటం : అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజుల పాటు జరిగిన మాసోత్సవాలు ముగిశాయని ఐసీడీఎస్ సీడీపీఓ సునంద తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలు దళితవాడ, మూలపల్లె, ఎస్‌కేఆర్ నగర్‌మెయిన్, సిద్దవటంలోని 1వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భవతులకు, బాలింతలకు, పిల్లల తల్లులకు సాక్షం అంగన్వాడీ కేంద్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి, ఎంపీడీఓ జవహర్ బాబు, మాజీ సర్పంచ్ ఓబులయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, గర్భవతులు, బాలింతలు, అంగన్‌వాడీ వర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : జాతీయ పోషణ మాసం ముగింపు, సాక్షం అంగన్‌వాడీ 2.0 ప్రారంభం కార్యక్రమాన్ని మండలంలోని 25 అంగన్ వాడీ కేంద్రాలలో నిర్వహించారు. సాక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చిన సంగాదేవిపల్లి, చెర్లోపల్లి, తుమ్మకొండ, పోల్లోపల్లి కేంద్రాలలో ఎల్ఈడీఆర్ఓ వాటర్, ఇంకుడు గుంత, పోషణ వాటిక, ప్రీ స్కూల్, ఈసిసిఈకి సంబంధించిన ఇతర సామగ్రి ఏర్పాటు చేస్తున్నట్లు సీడీపీఓ రాజేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, వర్కర్లు, ఆయాలు, పంచాయతీలలోని నాయకులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మంగంపేట మైనింగ్–2 అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ సౌభాగ్యమ్మ ప్రారంభించారు. అనంతరం గర్భవతులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మినుగు సుధాకర్, ఐసీడీసీ ఏసీడీపీఓ సరళదేవి, సూపర్ వైజర్లు అనుసూయమ్మ, నిర్మల, బీజేపీ నాయకులు పులపుత్తూరు, రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండలంలోని 26 అంగన్ వాడీ సెంటర్‌లకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయలక్ష్మీ తెలియజేశారు. సాక్షం కార్యక్రమంలో భాగంగా అనంతంపల్లి, కృష్ణంపల్లి, టి కమ్మపల్లి, వడ్డిపల్లి తదితర గ్రామాలలోని అంగన్ వాడీ సెంటర్లు ఎంపికయ్యాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వనజ, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్ : కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డుపై అవాస్తవాలు ప్రచారం చేసి కోట్లాది ప్రజల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి పతనం తప్పదని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ పబ్బం కోసం కులమత రాజకీయాలను ప్రోత్సహించడం చంద్రబాబుకే అలవాటన్నారు. కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ తగ్గించడానికి ఇలాంటి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇతర రాష్ట్రాలలోని బీజేపీ ఎంపీలే చంద్రబాబు మాటలను తప్పు బడుతుంటే సిగ్గురాలేదా అని ప్రశ్నించారు. హిందూ ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తూ కుల, మతాలతో ఆడుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు వెంకటేశ్వరస్వామే త్వరలో బుద్ధి చెబుతాడని ఆయన పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా లక్ష్మినారాయణ



లక్ష్మినారాయణను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి సబ్ రిజిస్ట్రార్‌గా లక్ష్మినారాయణ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కార్యాలయంలో తన బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా పాకాల నుంచి సాధారణ బదిలీపై రాయచోటికి వచ్చారు. ఆయనకు రాయచోటి సబ్ రిజిస్టార్ వారి కార్యాలయ సిబ్బంది పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు.

ఎక్సైజ్ సీఐగా మల్లిక



రాజంపేట : రాజంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.మల్లిక నియమితులయ్యారు. ఈమె సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. కర్నూలు నుంచి రాజంపేటకు ఆమె బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖపరంగా మెరుగైన సేవలందిస్తామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ వైకోమ్‌నైదియాదేవిని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐగా తులసీ


రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐగా తులసీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరు పరిధిలో నాటుసారా, గంజాయి, తదితర అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు తహసీల్దార్‌గా మహబూబ్ చాంద్



రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటాక ఎట్టకేలకు రైల్వేకోడూరు మండలానికి తహసీల్దార్‌ను కేటాయించింది. సోమవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్‌గా మహబూబ్ చాంద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాజంపేటలో విధులు నిర్వహిస్తూ రైల్వేకోడూరుకి బదిలీ అయ్యారు.

ఉత్తమ ఆచార్యులుగా ఎంపిక



హేమకేశవులు

రాజంపేట : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యులుగా పని చేస్తున్న డాక్టర్ ఒ.హేమకేశవులను ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ సెక్షన్ వారు రాష్ట్ర ఉత్తమ ఆచార్యులుగా ఎంపిక చేశారు. ఆయనను యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోఛాన్సలర్ అభిషేక్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ మల్లికార్జున రావు, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం పద్మలలిత, పరిపాలనాధికారి నూకా సుబ్బారెడ్డి, డీన్స్, వివిధ విభాగాల హెచ్ఒడీలు, అధ్యాపకులు అభినందించారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి పేదలకు ఉపాధి కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతుల చిన్నయ్య తెలిపారు. మండల కార్యదర్శి తేజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు సమస్యలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గంగయ్య, రెడ్డయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితులు

రాయచోటి అర్బన్ : ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పోతగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ముదివేడు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భూనిర్వాసితులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 780 ఎకరాల భూములకు రూ. 108 కోట్లు నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించి తర్వాత పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే భూ నిర్వాసితులకు 5 సెంట్ల భూమిని కేటాయించడంతో పాటు ఇంటినిర్మాణం కోసం రూ. 25 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : తమను వెంటనే క్రమబద్ధీకరించాలని జిల్లాలోని 10 ప్రభుత్వ విభాగాలకు చెందిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26వేలు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. 240 రోజుల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

ఎన్నికల సమయంలో కూటమి నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వలంటీర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లకు రూ. 10వేల జీతం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీ గురించి ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వలంటీర్ల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు నేర్పించడం ప్రశంసనీయం



డీఈఓను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రామాపురం : నైపుణ్యం కలిగిన విద్యార్థులుగా తీర్చి దిద్దడంలో బిట్స్ విద్యాసంస్థల పనితీరు అమోఘమని జిల్లా విద్యాశాధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బిట్స్ కళాశాల ఆధ్వర్యంలో సెమినార్ ఏపీ విజన్ 2047 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఏపీ విజన్2047 విస్తృత లక్ష్యాలకు దోహదపడేలా బిట్స్ ఒక మైలురాయిగా నిలుస్తోందన్నారు. విద్యార్థులకు ఆవిష్కరణ, పరిశోధన అభివృద్ధికి దోహదపడే నైపుణ్యాలు నేర్పించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం బిట్స్ విద్యాసంస్థల డైరెక్టర్ భాస్కర్, ప్రిన్సిపాల్‌లు డీఈఓ శివప్రకాష్‌రెడ్డిని సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రాల అద్దె చెల్లించాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : గత 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనాల అద్దెను వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం రాయచోటి ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 సంవత్సరాల ఈవెంట్స్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం రిజిస్టర్‌లను సరఫరా చేయకపోవడంతో కార్యకర్తలే కొనుగోలు చేసి తేవాల్సి వస్తోందన్నారు. 15 మంది కార్యకర్తలు, సహాయకుల జీతాలు పెండింగ్‌లో ఉండగా, 8 మంది రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ నాయకురాళ్లు సిద్దమ్మ, ఖాజాబీ, విజయ, అరుణ, సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లవారిపల్లె దళితుల ధర్నా



ధర్నా చేస్తున్న కొల్లవారిపల్లె దళితులు

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియా దేవి చాంబరు ఎదుట మండలంలోని కమ్మపల్లెలలో ఒకటైన కొల్లవారిపల్లె దళిత(అరుంధతీవాడ)మహిళలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరుంధతీవాడలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 386లో గతం దళితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆ స్థలంపై గ్రామంలోని కొందరు అగ్రవర్ణాలకు చెందిన వారి కన్ను పడిందన్నారు. ఆ స్థలంలో ముళ్లకంచె, సూచికబోర్డు తీసేసి, కబ్జాకు యత్నం చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగికి ఘన సన్మానం



పురుషోత్తంరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి : ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిగా పురుషోత్తంరెడ్డి వృత్తికే వన్నె తెచ్చారని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి, ఆయన సతీమణి జ్యోతిలను సహోద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు కోదండ నాయుడు, ఈశ్వరయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు విశ్వనాథం, శ్రీనివాసులు, బాబు, దుర్గరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రారంభం



బ్యాంకును ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లిలో ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసినటువంటి ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంక్‌ను మేనేజర్ బండి నరేష్, అపార్టుమెంట్ యజమాని చెల్లు శ్రీనివాసయాదవ్ ఆహ్వానం మేరకు రవాణా శాఖ, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి టిడిపి పార్టీ ఆఫీసులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నీరు, రోడ్లు, నూతన పెన్షన్లపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకులు యనమల మదన్ మోహన్, రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సెల్ కార్యదర్శి ఎస్ఎండీ షఫీ, బ్యాంక్ మేనేజర్ నరేష్, కావలి ఆంజనేయులు, ఆది మూలం రెడ్డిశేఖర్, టీడీపీ ప్రచార కార్యదర్శి యనమల విశ్వనాథ్, గురుస్వామి, వెంకటేష్, కె. ఆంజనేయులు, సుంకర వెంకటరమణ, కె.సునీల్, చిట్లూరు చలపతి, చిన్న, అంజి, నజీర్, గంట వెంకటకృష్ణ, షేక్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం దీక్షలు

రాజంపేట రూరల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం అక్టోబర్ 1, 2, 3 తేదీలలో చేసే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, విద్యార్థి, యువజన, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ దీక్షల్లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రాయుడు, పట్టణ కార్యదర్శి ఈ సికిందర్, నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రగతిపై దృష్టి సారించాలి

రాజంపేట రూరల్ : నియోజకవర్గ సమగ్రాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం, పాలకులు దృష్టి సారించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవరా, సహాయ కార్యదర్శి ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్సి ఈ సికింధర్‌లతో కలిసి మహేష్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా ఉందని మండిపడ్డారు. నందలూరులో మూతపడిన ఆల్విన్ పరిశ్రమకు ప్రత్యామ్నాయం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.